# త్యాగబ్రహ్మము

*(ఇతడు ఆంధ్రప్రదేశ్, కర్నూలు జిల్లా కాకర్ల గ్రామవాసి. తమ తాత తండ్రులు అరవరాజ్యమున తిరువయ్యూరులో స్థిరనివాసులగుటచే తాను వారలతో నిలచిపోయెను. చిన్నప్పటినుండియు దైవభక్తి, నాదోపాసన సలుపుచుండెను. తండ్రి యితని శ్రద్ధ చూచి సరియైన గురువులను యెంచి సంగీతము నేర్పించెను. ఒక సంగీతమేకాక అందులోని భావమును కూడను గ్రోలిన నాదస్వరూపుడే త్యాగయ్య అని చెప్పవచ్చు. ఏకాంతసమయమున తన భావ, రాగ, తాళ, లయలతో దైవమును కీర్తించి ప్రార్థించి సాక్షాత్కరింప జేసుకొనెడివాడు. రామనామమును కొన్ని సంవత్సరములు చేసి దీక్షను పూర్తిగావించి ఆనాటి రాత్రి రామదర్శనమును అందుకొన్న అదృష్టవంతుడు. ధనకనకవస్తు వాహనాదులను తుచ్ఛముగా భావించి, రాముడే తన సర్వస్వముగా విశ్వసించి సంచరించే నిశ్చలచిత్తుడు. నిరంతర రామపూజా నిమగ్నుడు. ఒకనాడు తంజావూరు రాజా అతనిని ఆస్థానమునకు పిలిపించి అతని పాండిత్యమునకు మెచ్చి వరహాలిచ్చి పంపగా వాటిని ముట్టక వాపసు పంపుటచే, అతని అన్న వచ్చిన లక్ష్మిని వమ్ముచేయు పిచ్చివారుందురా యని, తమ్ముడైన త్యాగయ్యకు పిచ్చి పట్టినదని తలంచి రామ విగ్రహములను కావేరీలో పడవేయగా త్యాగయ్య నిత్యారాధనకు నిలచిన తన ప్రాణసమానమైన రాములు కానరాలేదని అతనిని వెతుకుచూ వూరు వూరు తిరిగి పాడిన పాటలు హృదయములను కరగించినవి. అవి పండితుడు పాడినవి కావు. ఈ పాటలన్నియు భావావేశముచే ఆయా సమయములందు రాముని చింతించిన హృదయారాట, ఆనంద గీతాలే పాటలుగా పాడినాడు. నిజముగా త్యాగయ్య భక్తి ప్రపత్తులు, రాముని తన తండ్రిగ, సీత తన తల్లిగ భావించి హక్కుతో బాంధవ్యముతో అడిగిన మాటలు కోరిన కోర్కెలు, చేసుకున్న విన్నపములు ఆత్మసంబంధముగా చూపినవేగానీ అన్య ప్రదర్శనలు కావు. అతని కీర్తనలు నేడు లోకవ్యాప్తి గాంచి, భాషాభేదములు లేక సర్వులూ కీర్తించి పవిత్రులగుచున్నారు. త్యాగరాజు దైవసుఖముకంటె మించిన సుఖము లోకమున లేదనియును, రామచింతన తెలిసి చేయుట మంచిదనియును, రామరత్నముగను, వెలలేని మాణిక్యమనియు దానిని పొందిన వారలు పవిత్రులనియు ఆచరణ రూపమైన ప్రచారము సలిపెను. అతను కొన్ని వేల గీతములు వ్రాసెను. అవియే నేడు త్యాగరాజ కీర్తనలని సార్థకనామమునందుకొన్నవి.)*

**జననం**

త్యాగరాజు పూర్వీకులు ముత్తాతలు కర్నూలు జిల్లా కాకర్ల అనే పల్లెలో నివసించేవారు. పంచనదబ్రహ్మం త్యాగరాజు ముత్తాత. ఇతడు బీద కుటుంబమునందు జన్మించటం చేత సంసారము గడుపుకోటం కష్టమైంది. ఆ కాలములో కృష్ణదేవరాయలవలె తంజావూరు మహారాజు గాయకులను, కవులను, పండితులను పోషించటంలో గొప్ప పేరు పొందాడు. ఈ వార్తను మిత్రుల ద్వారా విని పంచనదబ్రహ్మం కుటుంబముతో తంజావూరు చేరుకున్నాడు. ఇతనికి సదాశివబ్రహ్మం, సదానందబ్రహ్మం, సచ్చిదానందబ్రహ్మం, బాలబ్రహ్మం, గిరిరాజబ్రహ్మమని ఐదుగురు కుమారులు. ఈ గిరిరాజబ్రహ్మం గొప్ప పండితుడు, గొప్ప కవి, గొప్ప గాయకుడు. ఇతని మూడవ కుమారుడు రామబ్రహ్మము. ఈ రామబ్రహ్మమునకు ముగ్గురు కుమారులు. మొదటి కుమారుడు జపేశుడు. రెండవవాడు రఘునాథ్. ఇతనినే రఘునాథమని పిలిచేవారు. మూడవ కుమారుడు త్యాగరాజు. త్యాగరాజు గర్భములో ఉండినప్పుడు తల్లి తండ్రి యిరువురు కూడను చాలా విచారించేవారు. త్యాగరాజు తాతలు, ముత్తాతలు మహావిద్యావంతులుగా,

గుణవంతులుగా, సదాచారులుగా పేరుపొందినవారు. ముందు పుట్టిన జపేశ, రఘునాథములు చదువులో చాలా వెనుకపడిపోయారు. స్కూలుకు పంపితే వెళ్ళేవారు కాదు. ఎక్కడో తోటలూ, అడవులూ తిరుగుతూ కాలము వ్యర్థము గావించేవారు. రామబ్రహ్మం తన బిడ్డ లిరువురును తనకు అపకీర్తి తెస్తున్నారని చాలా పరితపించేవాడు. మూడవ గర్భము రావటంచేత తల్లిదండ్రులిరువురు ఈ బిడ్డ ఎలాంటి వాడౌతాడో అని చాలా విచారపడేవారు. ఒకనాడు రామబ్రహ్మమునకు కలలో ఎవరో కనిపించి, 'తక్షణమే మన గ్రామమునకు ముందున్న త్యాగరాజు మందిరమునకు రావలసినది' అన్నారు. రామబ్రహ్మం యేదో స్వప్నమని అలక్ష్యము చేశాడు. మరి ఒక గంటకు ఎవరో తలుపులు తట్టారు. తలుపు తీస్తే ఒక వ్యక్తి కనిపించి, 'రామబ్రహ్మం! నీవు చాలా విచారిస్తున్నావు. నా వెంటరా' అంటూ రామబ్రహ్మమును పిల్చుకొని ఊరుముందున్న త్యాగరాజు మందిరమునకు వెళ్ళాడు. తిరువయ్యూరులో గాయకుడు త్యాగరాజు పుట్టక పూర్వమే త్యాగరాజు మందిరమొకటి ఉంటున్నాది. అక్కడికి వెళ్ళిన తరువాత, 'రామబ్రహ్మం! నీ పుట్టబోయే కుమారుడు నా అనుగ్రహ ప్రసాదము. అతడు మహా భక్తుడు, గొప్ప కవి. అనేకవిధములుగా లోకప్రఖ్యాతి పొందగలడు. ఇలాంటి కుమారుని నీకు అనుగ్రహిస్తున్నాను' అన్నాడు. నీవెవరని ప్రశ్నిస్తే, 'త్యాగబ్రహ్మము' అని అంతర్థానమయ్యాడు. ఇంటికి వచ్చేటప్పటికి భార్య ప్రసవవేదన పడుతున్నాది. ప్రక్కింటివారిని పిలిచి రామబ్రహ్మం సహాయం కోరాడు. అమ్మలక్కలు చేరి ఆమెకు సహాయం చేశారు.

**బాల్యం**

వెయ్యిన్ని ఏడువందల అరవైయేడో(1767) సంవత్సరము, మే నాల్గవతేదీ వైశాఖ శుద్ధ షష్ఠి తెల్లవారుఝామున బ్రహ్మముహూర్తములో మూడున్నర గంటలకు శిశువు పుట్టాడు. ఆ పిల్లవాడు పుట్టినప్పటినుండి అల్లారుముద్దుగా, ఆప్యాయంగా పెరుగుతూ వచ్చాడు. ఐదవ సంవత్సరము వచ్చేటప్పటికి ఇతడు గొప్ప విద్యావంతుడు కాగలడనే విషయాన్ని మనసునందుంచుకున్న రామబ్రహ్మం గొప్ప పండితులను పిలిపించి అక్షరాభ్యాసం చేయించాడు. అప్పటినుండి త్యాగబ్రహ్మ విద్యలు నేర్చుతూ ఆటపాటలయందుకూడా అల్లర్లు లేక వినయవిధేయతలతో పెరుగుతూ వచ్చాడు. ఒకనాడు యింటిముందు పిల్లలతో ఆడుకుంటుండగా ఒక వ్యక్తి వచ్చి త్యాగరాజును రెప్పవాల్చకుండా చూస్తూ ఉన్నట్టుండి,' త్యాగూ! నన్ను మీ యింటికి తీసుకొని వెళ్ళు' అన్నాడు. తన తల్లి త్యాగు అనే పిలుస్తుండేది. ఈతను నూతన వ్యక్తిగా ఉంటున్నాడు. 'నా పేరెట్లా తెలుసును' అనుకొని అతణ్ణి ఇంటికి తీసుకు వెళ్ళాడు. ఈ వ్యక్తి రామబ్రహ్మమునకు, అతని భార్యకు, 'అమ్మా! మీ కుమారునికి నేను రామ షడక్షర మంత్రాన్ని ఉపదేశించాలని ఆశపడుతున్నాను' అన్నాడు. అతను ఎవరని విచారిస్తే రామకృష్ణానంద అని తెలిసింది. ఆయన త్యాగరాజుకు మంత్రోపదేశం చేశాడు. తల్లిదండ్రులు ఆనందించారు. ఏకాగ్రచిత్తుడై త్యాగరాజు అదే నామాన్ని జపిస్తూ వచ్చాడు. అప్పటినుండి యేవో చిన్నచిన్న పాటలు పాడుకుంటూ భగవంతుని కీర్తిస్తూ క్రమక్రమేణా పెరుగుతూ వచ్చాడు. రామబ్రహ్మం ఆరోగ్యం క్షీణిస్తూ వచ్చింది. త్యాగరాజుకు సంగీతంలో చాలా అభిరుచి కలదని గుర్తించి సరైన గురువు దగ్గర సంగీత విద్యను అభ్యసింపచెయ్యాలని ఆశించాడు. తంజావూరు మహారాజు దగ్గర శొంఠి వెంకటరమణయ్య అనే గొప్ప విద్వాంసుడు ఉండేవాడు. అతడితో మా బిడ్డకు సంగీతము అభ్యసింపజేయాలని ప్రార్థించి కోరాడు. ఆ బిడ్డయందు సంగీత సంస్కారం ఉన్నదా లేదా అని శొంఠి వెంకటరమణయ్య శ్రుతిలయ రాగతాళములు పరీక్షించాడు. ఇతని స్వరమును, మధుర కంఠమును, రాగతాళ సంస్కారమును గుర్తించిన శొంఠి వెంకటరమణయ్య యిలాంటి శిష్యుడు చిక్కటం చాలా దుర్లభమని లో లోపల విచారించుకున్నాడు. రామబ్రహ్మముతో, 'ఇక మీ బిడ్డ కాదు. నా బిడ్డగా చూసుకుంటాను' అని చెప్పి తన యింటిలో పెట్టుకున్నాడు. త్యాగరాజుకు ఒక పాఠం ప్రారంభించి శొంఠి వెంకటరమణయ్య తన గదిలోనికి వెళ్ళాడు. త్యాగయ్య ఒంటరిగా ఒక పటం ముందు కూర్చొని, 'తవ దాసోహం, తవ దాసోహం, దాసోహం తవ దాశరథే' రామా! నేను నీ దాసుడను, నీ దాసుడను అని పాడుతున్నాడు. ఈ గానం విని శొంఠి వెంకటరమణయ్య వచ్చి వెనుకనే నిల్చుకొని వింటూ ఉన్నాడు. గురువును మించిన శిష్యుడు కాబోతున్నాడని ఆనందించాడు. ఈవిధముగా సంగీత సాహిత్యాలు గుర్తించే సమయంలో తండ్రిగారినుండి వార్త వచ్చింది. తండ్రిగారు

ఉండేది తిరువయ్యూరు. త్యాగరాజు విద్య నేర్చుకొనేది తంజావూరు. తండ్రిగారి ఆరోగ్యం క్షీణించింది. తక్షణమే రావాలని కబురొచ్చింది. అప్పటికి త్యాగరాజుకు 16, 18 సంవత్సరములుంటాయి. త్యాగరాజు కళ్యాణం కనులారా చూడాలని ఆశించాడు రామబ్రహ్మము. కాళహస్తి అయ్యంగారని వీణలో గొప్ప విద్వాంసుడు ఉండేవాడు. అతనికి గిరిరాజ బ్రహ్మముగారికి చాలా స్నేహము. అతను రామబ్రహ్మము యింటికి వచ్చి, 'రామబ్రహ్మము నా మనుమరాలుంటున్నాది. ఆమెనిచ్చి మీ కుమారునికి పెండ్లిగావించాలని ఆశిస్తున్నాను' అన్నాడు. ఆ మనుమరాలి పేరు పార్వతి. రామబ్రహ్మము యిదే విషయాన్ని చింతిస్తూ ఉండటంచేత, వెదకబోయిన తీగ కాలికే చుట్టుకున్నట్లుగా, ఆనందించాడు. సరేనన్నాడు. ఒక వారం లోపలనే పెండ్లికూడా జరిగిపోయింది. రెండు నెలలు గడిచిందో లేదో ఆ పార్వతమ్మ మరణించింది. రామబ్రహ్మం కూడను మరణించాడు. తల్లిగారైన సీతమ్మ చాలా బాధపడి సహగమనానికి సిద్ధపడింది. గ్రామస్థులందరూ చేరి లేతవయస్సులోనున్న త్యాగరాజును వదలిపెట్టి తల్లిదండ్రులు పోవటం న్యాయం కాదని త్యాగరాజును చూసుకొని బ్రతకమని ఆమెను అనేకవిధములుగా ప్రాధేయపడి సహగమనాన్ని నిలుపబెట్టారు.

### స్వరార్ణవం

ఈమధ్యకాలములో త్యాగరాజు బాధపడుతూ రాములను ప్రార్థించాడు. రోగము హెచ్చయ్యే సమయం లోపలనే ఔషధము సరిగా పనిచేస్తుందని ఇది సరైన సమయమని నారదుడు భావించి రామకృష్ణానంద రూపములో వచ్చాడు. వచ్చి సీతమ్మతో, 'అమ్మా! మీ కుమారుడెక్కడ?' అని కుమారుని పిలిపించి ఒంటరిగా తీసుకువెళ్లి, అతనికి 'స్వరార్ణవము' అనే ఒక పుస్తకాన్ని యిచ్చాడు. స్వరార్ణవము జగత్తులో ఎవ్వరికీ లభించేది కాదు. ఇది తుంబురు, నారదులకు తప్ప అన్యులకు చిక్కేది కాదు. ఆ గ్రంథమును త్యాగరాజు చేతికిచ్చి, 'నేను రామకృష్ణానంద కాదు. సాక్షాత్తు నారదుణ్ణి. ఆనాడు వాల్మీకికి నేను రామాయణమును బోధ చేసి కావ్య రూపములో జగత్తునకు అందింపజేశాను. ఈనాడు నీద్వారా గానరూపములో జగత్తునకందించాలని సంకల్పించుకున్నాను. నీవు త్యాగరాజనుకోటం కాదు, నీవు వాల్మీకి అంశమే' అన్నాడు. ఆనాటినుంచి త్యాగరాజును వాల్మీకియొక్క రెండవ అవతారమని ప్రజలు భావిస్తూ వచ్చారు. స్వరార్ణవ గ్రంథమును ప్రారంభించే నిమిత్తమై త్యాగరాజు ఒక గొప్ప సభను జరపాలని ఆశించాడు. ఆసమయంలో తన గురువైన శొంఠి వెంకటరమణయ్యను పిలిపించాడు. శొంఠి వెంకటరమణయ్య స్వరార్ణవము చూచి ఆనందించి, 'గురోర్గురుః. నీవు అందరికంటె గొప్పవాడివౌతావు నాయనా!' అని అతన్ని కీర్తించాడు. ఈ సమావేశములో కవులు, గాయకులు, పండితులు చేరి త్యాగరాజును తిరిగి గృహస్థునిగా చేయాలని పట్టుపట్టారు. చనిపోయిన పార్వతికి కమల అనే చెల్లెలు ఉండేది. కమలతో యితనికి వివాహము చేయాలని నిర్ణయం చేసి కాళహస్తి అయ్యంగారిని ఒప్పించారు. ఒక వారం లోపలనే పెండ్లి జరిగిపోయింది.

### ఎందరో మహానుభావులు

స్వరార్ణవమును ప్రారంభించిన నాటినుండి త్యాగరాజు వాగ్ధోరణి సరళంగా సాగిపోతూ వచ్చింది. పుస్తకాన్ని అక్కడ పెట్టి ప్రారంభించాడు. 'శ్రీగణపతిని సేవింపరారె' అదే ప్రారంభము. ఇతని కవిత్వము, సంగీతము వినిన వారందరి హృదయాలు కరిగిపోయేవి. ఇది క్రమక్రమేణా పండితులకు, సంగీత సాహిత్యములలో ప్రవీణులైన మహా గాయకులకంతా తెలిసిపోయింది. ఇతని సంగీతము హృదయము, భావము రెండింటిని యిమిడ్చి భక్తిరసముతో కూడిన సంగీతముగా రూపొందింది. గాయకులు శృతిలయరాగ తాళములు మాత్రమే చూస్తారు. కాని, త్యాగరాజు అట్లా కాదు. శృతిలయరాగ తాళములు తమంత తామే చేరిపోతున్నాయి. భావమే అతనికి ఆధారము. ఒకానొక సమయంలో శొంఠి వెంకటరమణయ్య త్యాగరాజును తన గృహమునకు వచ్చి గాయకులనంతా ఆనందపరచాలని కబురు పంపాడు. అక్కడ భోజనానంతరము గాయకులనందరిని చేర్చి, 'త్యాగు! నీవు గానం చేసి ఈ గాయకులను నీ కవిత్వముచేత, నీ పాండిత్యముచేత, నీ భావశుద్ధిచేత ఆనందపెట్ట'మని కోరాడు. ఆనాడు త్యాగరాజు చేసిన గానము అమోఘము. ఇది అటూ యిటూ చేరి తంజావూరు రాజుగారికి తెలిసి వెంకటరమణయ్యను పిలిపించి నీ

శిష్యుడైన త్యాగరాజును మన సభకు పిలిపించమని కోరాడు. ఇతను వర్తమానం పంపించి త్యాగయ్యను తంజావూరికి రప్పించుకున్నాడు. శొంఠి వెంకటరమణయ్య చెప్పిన సంగతి వినగానే త్యాగయ్య యిలా ప్రార్థించాడు. 'నేను రామదాసుణ్ణి కాని రాజదాసుణ్ణి కాదు. నా సర్వస్వమూ రాముడే. రాముణ్ణి తృప్తి చేయటమే నా జీవిత లక్ష్యము. రాజులను తృప్తి చేయటం నాకు యిష్టం లేదు' అన్నాడు. శొంఠి వెంకటరమణయ్య తన గురువు. తన మనుమరాలినిచ్చి పెండ్లి చేసిన వీణ కాళహస్తి అయ్యంగారు రాజు దగ్గర సంగీతము వినిపించి రాజు మన్ననలను పొందమని కోరినారు. గురువాజ్ఞను ధిక్కరించే స్వభావము కాదు త్యాగరాజుది. గురువుకు నమస్కరించి, 'గురూజీ! మీ ఆజ్ఞను నేనుశిరసా వహిస్తున్నాను. కాని, రాజును మెప్పించే ఉద్దేశ్యము కాదు' అన్నాడు. గొప్పగొప్ప పండితులంతా ఉంటున్న ఆ సభలో చిన్నవాడైన త్యాగయ్య స్వాభావికమైన వినయముతో, విధేయతతో, 'ఎందరో మహానుభావులు అందరికీ వందనములు' అంటూ గురువు తట్టు చూచాడు. 'చందురు వర్ణుని అందచందమును హృదయారవిందమును జూచి బ్రహ్మానందమనుభవించు వారెందరో మహానుభావులు'. సామాన్యంగా పండితులకు గర్వమధికం. గాయకులకు మరింత అధికం. ఈ వినయవిధేయతలు చూచేటప్పటికి వీరందరికిని బుద్ధి నేర్పినట్టుగా జరిగింది. ఈ గానము విని తంజావూరు మహారాజు కంటిధారలు కారుస్తూ ఆనందములో మునిగిపోయాడు. తన జీవితంలో యిలాంటి భావమిళితమైన గానమును, సంగీతమును వినలేదని తలంచుకున్నాడు.

**నిధిచాల సుఖమా**

ఈవిధంగా సభను ముగించుకొని త్యాగరాజు తిరువయ్యూరు చేరిపోయాడు. మరికొంత కాలమైన తరువాత తంజావూరు మహారాజు తన ఆస్థానమునకు రావలసిందని త్యాగరాజుకు కబురు పెట్టాడు. అనేకవిధములైన బహుమతులు పంపించాడు. త్యాగరాజు ధనమును చూచి ఛీ కొట్టాడు. ఇక్కడే, 'నిధి చాలా సుఖమా, ఈశ్వర సన్నిధి చాలా సుఖమా, నిజముగ దెల్పుము మనసా' అని మనస్సును ప్రశ్నించుకున్నాడు. ఈ భావమును గుర్తించిన జపేశుడు ఉగ్రుడైనాడు. 'మన ఇంటి పరిస్థితి నీకు తెలిసికూడను వచ్చిన లక్ష్మిని కాలదన్నే నీ అంత మూర్ఖుడు ఎవడైనా ఉంటాడా! నీవు చాలా మూర్ఖుడుగా ఉంటున్నావు. ఈ ధనమును అంగీంకరించ' మని వత్తిడి పెట్టాడు. అన్న దగ్గర వినయవిధేయతలతో చేతులు కట్టుకొని త్యాగరాజు, 'అన్నా! రామదాసులు కావాలిగానీ ధనదాసులు కారాదు' అని అనేకవిధములుగా నచ్చచెప్పటానికి ప్రయత్నించాడు. అన్నకు చెప్పి ప్రయోజనము లేదని బయటకు వచ్చి రాజభటులతో చెప్పాడు. 'ఈ తెచ్చిన ధనము నాకు అక్కరలేదు. మహారాజు గారికే అందించమని' వెనుకకు పొమ్మన్నాడు. వచ్చిన రాజభటులు త్యాగరాజు ఆజ్ఞను శిరసావహించి కానుకలను వెనుకకు తీసుకు వెళ్ళారు. ఈ దృశ్యమును చూచిన జపేశుడు మండిపోయి, 'నీకు నాకు యిక సంబంధము లేదు. ఈ కుటుంబము చీలిపోతున్నది. నీ మొండితనమే మన సంసారమునకు హాని కలిగిస్తున్నది' అని తూలనాడి రెండవ దినమే ఆ యింటికి రెండు గోడలు కట్టించి యింక అతనితో కలసి ఉండటానికి వీలుకాదని పూర్తి విరుద్ధముగ మారిపోయాడు. తల్లి సీతమ్మ చాలా యేడ్చింది. భార్య కమల కూడా పాదములు పట్టుకొని ప్రార్థించింది. అన్న మనస్సును నొప్పించరాదని బోధించారు. కాని, త్యాగరాజు వినయముతో, 'అన్న మనస్సు నేను యేమాత్రము నొప్పించటం లేదు. అన్నకు నేనెప్పుడూ విధేయుడనే. కాని, ధనమును మాత్రం నేనాశించను' అన్నాడు.

**ఎందువెదకుదురా**

గోడ వెనుక భాగములో నిత్యము త్యాగరాజు గానము చేస్తుంటే చెవులు కట్టుకునేవాడు జపేశుడు. 'వినాశకాలే విపరీత బుద్ధిః' అన్నట్లు వినాశకాలం రాబోయే సమయం కనుక ఒకనాడు అతనికి విపరీతమైన బుద్ధి పుట్టింది. అర్థరాత్రి త్యాగరాజు నిద్రించే సమయంలో జపేశుడు ఒక నిచ్చెన వేసుకుని పూజామందిరంలో దిగి త్యాగరాజు పూజించుతున్న సీతారామలక్ష్మణ హనుమంతుల విగ్రహములు తీసుకొని కావేరీ నదిలో పడవేశాడు. త్యాగయ్య

తెల్లవారి లేచి స్నానం చేసి పూజామందిర్‌లో ప్రవేశించేటప్పటికి విగ్రహములు లేవు. అన్నివైపులా పరికించాడు. ఎక్కడా కనిపించ లేదు. 'నేనెందు వెదుకుదురా, నిను నేనెందు వెదుకుదురా! శ్రీహరి నేనెందు వెదుకుదురా!' కంటి ధారలు కార్చుకుంటూ 'ఎక్కడ నిన్ను వెతికేది? ఏ ప్రదేశం వెళ్ళేది? ఆ నగుమోమును నే నేరీతిగా చూచేది?' అని పరితపించాడు. త్యాగరాజు సంగీతము యేదో పొద్దుపోని సమయంలో వ్రాసిపెట్టుకొన్నది కాదు. ఆ సమయస్ఫూర్తి, ఆ సమయమునకు, ఆ సందర్భమునకు, ఆ రాగమునకు, ఆ భావమునకు సరిపోయే పాటలు పాడేవాడు. అక్కడ వుండే ట్యూన్సంతా ఏ సమయము, ఏ పరిస్థితియందు, ఏవిధమైన రాగము వేయాలి అనేది తనకు తెలియకుండానే దైవానుగ్రహంతో ప్రారంభమయ్యేది. ఇతనికి భావం ప్రధానం. 'నేనెందు వెదకుదురా, హరి నేనెందు వెదకుదురా' ఆ భావంతో హృదయాన్ని లాగి ప్రేమతో అతణ్ణి ఆకర్షింపజేసి దీనత్వంతో పాడినాడు. అతని భక్తి ప్రపత్తులు హృదయాంతరాళమునుంచి పెల్లుబికేటువంటివి. బయట పదములేకాదు హృదయనాదం కూడను ఆవిధంగా పరితపించేది. ఇలాంటి భక్తిప్రపత్తులతో నిండి ఉండేవాడు త్యాగయ్య. రాముడు తప్ప అన్యము అతని కేమాత్రమూ కనిపించేది కాదు.

**రామశక్తి ఎంతగొప్పది**

రామదర్శనం లేకుండా త్యాగరాజు క్షణమైనా ఉండేవాడు కాదు. కాని, అది త్యాగరాజు లోపమే! భగవంతుడు సర్వత్రా ఉండినప్పుడు ఆ విగ్రహములపైనే తన మనస్సును ఎందుకు యిముడ్చుకోవాలి? ఇది ప్రాకృతమైన అపేక్షయే. ఇట్టి ప్రాకృతమైన అపేక్ష ఉండటం చేతనే తాను దుఃఖానికి గురౌతూ వచ్చాడు. ఎవరైతే ఈ ప్రాకృత భావనలో ఆరాధన సల్పుతూ వస్తారో అప్పుడు వారికి అన్నీ సందేహాలే పుడుతూ ఉంటాయి. ఎందుకంటే యిది ప్రకృతి స్వభావము. ఇందులో సందేహములు చీమల పుట్టల వలె పుడుతుంటాయి. దీనికి కారణం యేమిటి? కోరికలు కూడా చీమలపుట్టల వలె పుట్టటమే. ఈ కోరికలను సందేహాలు నీడవలె అనుసరిస్తుంటాయి. ఈవిధమైన ప్రాకృత వాంఛలను అరికట్టుకోలేక త్యాగరాజుకు రామునిపై కోపం వచ్చింది. 'నేను నిరంతరం రామచింతనే చేస్తున్నాను. నా జీవితంలో జాగ్రత్ స్వప్న సుషుప్తులలో రామ చింతనను మరువ లేదు. కనుక, నా భక్తి నాకు తెలుసు. ఐతే. ఇప్పుడు నాలో భక్తి లేదా? రామునిలో శక్తి లేదా?' అని యోచించాడు. 'నిజంగా రామునిలో శక్తి ఉంటే తన భక్తుని ఎందుకు ఇన్ని బాధలకు గురిచెయ్యాలి?' అని విచారించాడు. ఇదే పెద్ద పిచ్చితనము. కారణమేమిటి? ఈ ప్రాకృతమునకు, పారమార్థికమునకు సంబంధం పెట్టకూడదు. ప్రాకృతం ప్రాకృతంగానే ఉండాలి, పారమార్థికము పారమార్థికముగానే ఉండాలి. అనగా, దేనిలో పోయిందో దానిలోనే సాధించాలి. ఐతే. త్యాగరాజులో భక్తి ఉన్నది కనుక మళ్ళీ విచారించాడు. 'ఇంత తొందరపాటు నాకు మంచిది కాదు. నిజముగా ఆ శ్రీరామునిలోనే శక్తి లేకపోతే ..

'కపి వారధి దాటునా? లక్ష్మిదేవి వలచునా? లక్ష్మణుండు కొలచునా?
సూక్ష్మబుద్ధిగల భరతుడు చూసి చూసి మ్రొక్కునా? ......
అబ్బ రామ శక్తి ఎంతో గొప్పదిరా......' అని కీర్తించాడు.

**ఎవరని నిర్ణయించేదిరా**

అన్ని కాలములయందు మంచివారిని చూచి చెడ్డవారు ఒకవైపున అభివృద్ధి అవుతుంటారు. ఇది క్రమేణా గ్రామాల్లో, పట్టణాల్లో ప్రాకిపోయింది. త్యాగరాజు రామనామమునే స్మరిస్తుంటాడు కాని శివనామమును స్మరించటం లేదు. ఇతను శివద్వేషి అని ప్రచారము మొదలు పెట్టారు. ఈ వార్త వారినోట వీరినోట పడి కడపటికి త్యాగరాజు చెవులో పడింది. తాను విచారపడ్డాడు. 'నా కిట్టి భేదం యేనాడూ లేదు. సర్వదేవతా స్వరూపుడు భగవంతుడనే దివ్యమైన భావంతో నిండినవాడిని. నాకెందుకు యిలాంటి వార్తలు' అని కుమిలిపోయాడు. భారమైన హృదయంతో పూజామందిరము చేరాడు. 'ఎవరని నిర్ణయించేదిరా, రఘువరా! శివుడవో, మాధవుడవో'' శివమంత్రమునకు 'మా'

జీవము. మాధవ మంత్రమునకు 'రా' జీవము. ఈ రెండింటియొక్క చేరికయే రామనామము. 'వివరము తెలిసిన ఘనులకు మ్రొక్కెద' కనుక, నాకు భేదము లేదే! నీవెవరని నేను చింతించాలి అని రామునికే చెప్పుకున్నాడు. తన బాధలన్నీ రామునికే తప్ప అన్యులకు చెప్పే స్వభావం త్యాగరాజులో లేదు. ఈ దుఃఖముతో కన్నులు మూసుకొని రాముని ధ్యానించాడు. ఆ ధ్యానము లోపల లక్ష్మణసమేతుడై విశ్వామిత్రునితో అరణ్యములో యజ్ఞసంరక్షణకై నడుస్తూ ఉండినట్లు రాముడు దర్శనమిచ్చాడు. తాను ప్రక్కన ఉండినట్లు ఈ ముప్వురూ నడచిపోతున్నట్లుగా దర్శనం చేసుకున్నాడు. ఆ దర్శనం లోపలనే తాను తన్మయుడైనాడు. నన్ను మాట్లాడించకుండా పోతున్నాడే అని ఆ ధ్యానములోనే పాట ప్రారంభించాడు. 'మారు బల్కకున్నావేమిరా రామ, మారు బల్కకున్నావేమిరా! మా మనోరమణ ॥మారు॥ జారచోర భజన చేసితినా, సాకేతసదన ॥మారు॥ ఈవిధంగా పలికేటప్పటికి కమల, సీతమ్మ పరుగెత్తుకొని వచ్చారు. త్యాగయ్యకు కుప్పయ్యర్ అని ఒక ముఖ్య శిష్యుడు ఉండేవాడు. ఆ కుప్పయ్య కూడను త్యాగరాజుతో శృతి కలిపి పాడేవాడు. ఏమిటో జరుగుతున్నాదని వాళ్లు ముగ్గురూ వెనుక నిల్చుకొని వింటూ ఉన్నారు. విశ్వామిత్రునితో యజ్ఞసంరక్షణకై వెళ్ళే రాముడు నా సంరక్షణ చేయలేడా అని త్యాగయ్య చింతించాడు.

### ననురక్షింప నడచివచ్చితివో

ఈవిధంగా ఉండి ప్రయోజనం లేదని తొలిఝాము, రాత్రి భార్యకు చెప్పలేదు. తల్లికి చెప్పలేదు. ఒంటరిగా చీకటిలో కావేరీ నదికి నడచిపోతున్నాడు. రాముడు లేని బ్రతుకు నాకెందుకు? రామ దర్శనము లేని చూపు నాకెందుకు? ఇక కావేరీలో పడిపోవచ్చునని వెళ్ళాడు. మోకాలు నీటిలో దిగాడు. రాములను అనేకవిధములుగా ప్రార్థించి చేతులు జోడించుకొని ఒక్క మునుగు మునిగాడు. దోసిలిలో రామ విగ్రహం వచ్చి చేరింది. తక్షణమే ఈ వార్తను యింటికి తెలియజేశాడు. దేవాలయం పల్లకిని తీసుకొని రమ్మని కబురు పంపాడు. ఈలోపల తెల్లవారింది. గ్రామస్థులందరికీ తెలిసిపోయింది. తిరువయ్యారులో ప్రతి వ్యక్తీ బ్రహ్మ ముహూర్తమునుండి కావేరీ నదిలో స్నానము చేయటము వాడుక. అందరు కావేరీ నదికి వచ్చి త్యాగరాజు ఆనందమును చూచి ఎంతో ఆనదించారు. తిరిగి రాముడు చిక్కాడు అనే విషయం తెలిసేటప్పటికి సీతమ్మ, కమల యెంతో ఆనందంగా పుష్పములు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు తీసుకొని కావేరి నదికి బయలుదేరి వచ్చారు. రాములను పల్లకీలో పెట్టి, 'రారా మా యింటి దాకా, రఘువీర, సుకుమార, నే మ్రొక్కెద, రారా మా యింటిదాకా. రారా దశరథకుమారా నన్నేలుకోరా, నే తాళలేరా ॥రారా॥' ఈవిధంగా ప్రార్థిస్తూ రాముణ్ణి యింటికి తెచ్చాడు. జపేశయ్య రాముణ్ణి యింటికి తెచ్చింది చూచాడు. ఎక్కడో మధ్య నదిలో పారవేస్తే నిండుగా పారుతున్న ఈ కావేరీ నదిలో త్యాగయ్య కెట్లా చిక్కింది? ఇది ఇతని మహాత్మ్యమే అన్నాడు. పరుగెత్తి వచ్చి అన్న, వదిన యిరువురూ త్యాగయ్య పాదాలపైన పడ్డారు. క్షమించమని ప్రార్థించారు. ఇది తాను చేసిన మహాపరాధమని చెప్పుకున్నాడు. అప్పుడు తమ్ముడు తిరిగి అన్న పాదములకు మ్రొక్కుతూ, 'అన్నా! ఇది నీవు చేసిన పని కాదు. రాములు నన్ను పరీక్షించిన పని'. ఈవిధముగా త్యాగరాజు ఏది జరిగినప్పటికీ అంతా రాముని అనుగ్రహమే, రామ సంకల్పమే అని భావించి పూర్ణానందమును పొందేవాడు.

### బ్రోచేవారెవరురా

పోయిన విగ్రహములు తిరిగి లభించినవనీ, ఇది త్యాగరాజుయొక్క మహత్తరమైన భక్తిప్రపత్తుల లక్షణమనీ విన్న తంజావూరు రాజాగారు, ఇంక పదేపదే అతనిని పిలచి బాధ పెట్టటం మంచిది కాదని నిశ్చయించుకున్నాడు. మారువేషములతో తంజావూరు మహారాజా, శొంఠి వెంకటరమణయ్య త్యాగయ్య ఇంటికి వచ్చారు. ఆనాడు రామ కళ్యాణం జరుగుతున్నాది. ఇంటికి వచ్చిన రామునికి కళ్యాణం జరుపుకుంటున్నాడు త్యాగయ్య. కళ్యాణం తరువాత, రామా! ఇంక నిన్ను వదలి నేనొక్క క్షణమైనా ఉండలేనని ప్రార్థన చేసుకుంటున్నాడు. కళ్యాణమునకు అనేకమంది వచ్చారు. తంజావూరు మహారాజా, శొంఠి వెంకటరమణయ్య ఈ కళ్యాణం గుంపులో చేరి కూర్చున్నారు. కన్నడ రాగము తంజావూరు మహారాజాకు చాలా యిష్టము. అది యేదో కాకతాళీయమనుకోవచ్చు లేక

రామానుగ్రహమనుకోవచ్చు. ఇతను ప్రారంభించాడు.

'నిన్ను వినా నా మది ఎందు నిలువదే శ్రీహరిహరి॥

కనులకు నీ సొగసెంతో కమ్మియున్నది రామా!॥నిను వినా॥

నీదు కథలు వీనులందు నిండియున్నవి రామా!'

ఈవిధంగా పాడేటప్పటికి తంజావూరు మహారాజు తన్మయుడైపోయాడు. ప్రార్థన చేసిన తరువాత త్యాగయ్య తీర్థ ప్రసాదములు యిచ్చాడు. అందరూ నమస్కారం చేసుకొని వెళ్ళారుగానీ ముగ్గురు మాత్రం అక్కడే ఉన్నారు. అందులో గొప్ప పండితుడు ముత్తుస్వామి దీక్షితులు ఒకడు. రెండవ వ్యక్తి శొంఠి వెంకటరమణయ్య. మూడవ వ్యక్తి తంజావూరు మహారాజా. 'ఏమండీ! ప్రసాదం తీసుకున్నారు కదా! ఇంకా మీరు వెళ్లలేదే!' అన్నాడు త్యాగయ్య. ఎందుకంటే ఏకాంతసేవ చేసుకోటానికి అవసరం. అప్పుడు వారు నలువైపులా చూచారు. డ్రస్సులను విప్పారు. వీరు మహాపండితులు. మహారాజు అప్పుడు ఒక చిన్న కోరిక కోరాడు. నాకు శుద్ధ బంగాళ రాగం చాలా యిష్టము. కనుక, ఒక్క కీర్తన చెప్పి నన్నానందపెట్టమని కోరుకున్నాడు. త్యాగయ్య ప్రారంభించాడు. 'రామభక్తి సామ్రాజ్యము, ఏ మానవులకబ్బునో మనసా' రాజానీవు ధనరాజువు కాని రామభక్తి సామ్రాజ్యమునకు నీవు రాజువైతే ఎంత ధన్యుడు కాగలవు ,అని మహారాజుకే ఒక డోసు వేశాడు. ఐతే తంజావూరు రాజా మహా భక్తుడు. కనుకనే, భక్తుని తన దగ్గరికి రప్పించుకోటము మహా అపరాధమని భావించి అప్పుడప్పుడు ఈవిధంగా మారువేషములు వేసుకొని త్యాగరాజు మందిరానికి చేరుతుండేవాడు. తరువాత త్యాగరాజు వాళ్ళకి వీడ్కోలిచ్చి లోపలకు వెళ్ళాడు. 'బ్రోచుటకు ఎవరున్నారు? నను బ్రోచుటకు ఎవరున్నారు? పరమాత్మ నిను వినా' నన్ను బ్రోవటానికి నీవు తప్ప అన్యము నాకెవరూ లేరు. ఈ మహారాజులు కాదు. ఈ గురువులు కాదు. ఎవ్వరూ కాదు. నన్ను బ్రోవటానికి, నీవు తప్ప అన్యులు లేరని ప్రార్థించాడు. ఏకాంతసేవ చేసే సమయంలో శిష్యుడు కుప్పయ్యరు అప్పుడప్పుడు శ్యామశాస్త్రివచ్చి చేరేవారు. వారుకూడా యితనితో శ్రుతి కలిపి వెనుకవైపున పాడుతుండేవారు. ఆనాడు ఎందుకతనికి ఆవిధంగా వేదన యేర్పడిందో! తనలో తాను వేదన చెందుతూ రాములు నన్ను వదలుతాడోయేమో! ఇలాంటి పరీక్షలు మధ్యమధ్య కల్పిస్తాడో యేమో అని తనలో తాను క్రుంగిపోతూ వచ్చాడు. 'బ్రోచే వారెవరురా! నిను వినా, రఘువరా, నను బ్రోచేవారెవరురా! ఓ చతురాననాది వందిత నీకు పరాకేలనయ్యా! నీ చరితము పొగడగలేను నా చింత దీర్చి వరములిచ్చి వేగమె బ్రోచేవారెవరురా! ॥నను॥ నాపై నీకభిమానము లేదా! వాతాత్మజాశ్రిత పాదా! నా మొరలను వినరాదా! ఆతురముగా కరిరాజును బ్రోచిన వాసుదేవుడవు నీవేకదా! నా పాతకమెల్ల పోగొట్టి గట్టిగ నా చేయి పట్టి విడువక బ్రోచేవారెవరురా!'. ఈవిధంగా ప్రార్థించి అలసిపోయాడు. తల్లి వచ్చి, 'నాన్నా! కొంచెమైనా ఆహారం తీసుకొని సేవ చేసుకో' మని చెప్పిన దానివల్ల వచ్చి భుజించాడు.

**నగుమోము గనలేని**

ఈవిధంగా కాలము గడిచిపోతున్నాది. త్యాగరాజుకు ఒకే బిడ్డ ఉంటున్నాది. ఆమె పేరు సీతాలక్ష్మి. కమలాంబ తన కూతురుకు వివాహం చేయాలని భర్తను ప్రోత్సహించింది. ఆమెకొక మార్గం చేసి మనం ఏవిధంగా కాలము గడిపినప్పటికీ తొందర ఉండదన్నది. త్యాగయ్యకుటుంబమంటే గ్రామమందరికీ గొప్ప అభిమానమే. ఈ వార్త వినేటప్పటికి మంచి కుటుంబములో ఉండే కుప్పు సామయ్య అనే యువకునికి అతని తల్లిదండ్రుల అభీష్టముతోనే సీతాలక్ష్మితో వివాహం జరిగిపోయింది. వివాహమునకు గొప్పగొప్ప పండితులు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి కూడా వచ్చారు. అందరికీ విందు జరిగింది. కేరళ నుండి వడివేలు అనే గొప్ప సంగీత విద్వాంసుడు వచ్చాడు. ఈ వడివేలు గానంచేశాడు. అనగా ఆనాడు రిసెప్షన్ అన్నమాట. ముత్తుస్వామి దీక్షితులు రెండుమూడు పాటలు పాడాడు. శ్యామశాస్త్రి ఒక పాట పాడాడు. త్యాగరాజును శొంఠి వెంకటరమణయ్య ఒక పాట పాడమని కోరాడు. ఆయన, 'నగుమోము గనలేని నాజాలి దెలిపి, జగమేలే పరమాత్మ ఎవరితో మొరలిడుదు, పగజూపకు తాళను నన్నేలుకోరా, త్యాగరాజనుత ॥నగు॥ ఖగరాజు నీ యానతి విని వేగ చనలేడో, గగనానికి యిలకు బహుదూరంబనినాడో!' అనే

కీర్తన పాడినాడు. ఇందులో ఒక చక్కని అంతరార్థాన్ని బోధించాడు. నీవు వైకుంఠవాసివని అనుకుంటారందరు. గజరాజు ప్రార్థిస్తే ఆ గజరాజు శబ్దము ఎంత దూరం పోతుందో అంత దూరంలో భగవంతుడున్నాడన్నమాట. నా హృదయనాదం వినే స్థానంలో నీవుంటున్నావు. నా హృదయనాదం నాకే వినిపించదు. నీకే వినిపిస్తుంది. అన్నింటికంటె అతి సమీపంలో ఉండేవాడు భగవంతుడనే సత్యాన్ని నిరూపించాడు త్యాగరాజు. 'తల్లి కంటె మిగుల దైవంబె దగ్గర' . తల్లి కంటె దగ్గరైనవాడు నా స్వామి కనుక, నా మొరను వినేవాడు నా హృదయస్థాయి అనే అర్థం పండితులందరూ గుర్తించుకోవాలని ఈ పాటను ప్రారంభించాడు. పెండ్లికి చేరిన పెద్దలందరూ చాలా ఆనందముతో త్యాగరాజు అందించిన భావం విందుతో వెళ్ళిపోయారు.

**తెరతీయగరాదా**

బిడ్డ పెండ్లితో భారం తీరిందనుకొని త్యాగయ్య తీర్థయాత్రలకు బయలుదేరాడు. త్యాగయ్యతో ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి బయలుదేరారు. శ్యామశాస్త్రికి కంచి వరదరాజస్వామి అంటే చాలా యిష్టము. అక్కడికి వెళ్ళారు. త్యాగరాజు ఎక్కడకు పోయినప్పటికి గానంతోనే భగవంతునితో సంభాషణ. 'వరద రాజ! నిను కోరి వచ్చితి' అనే కీర్తన పాడాడు. సంగీతమనేది లోపలి భావముయొక్క స్వరూపమే. ఇది భావముతో కూడిన మహాపవిత్రమైన ప్రపత్తి. భగవంతుడు గానప్రియుడు. కనుక, గానముతో భగవంతునిలో లీనమయ్యే మార్గము సులభంగా యేర్పడుతుంది. తరువాత తిరుపతికి వచ్చారు. వచ్చేటప్పటికి తిరుపతి వెంకటరమణస్వామికి తెర వేశారు. త్యాగయ్యకు చాలా కష్టమేసింది. ఆత్మ విచారణ సల్పుకున్నాడు. ఈతెర నాలోపల ఉందా? నా బయట ఉందా? నాలోపల తెర ఉంటేనే బయట తెర వస్తుంది. ఈ జగత్తంతా హృదయము యొక్క పరిణామమే. ప్రతి ఒక్కటి 'రిఫ్లక్షన్ ఆఫ్ ది ఇన్నర్ బీయింగ్' అనుకున్నాడు. 'తెర తీయగరాదా, నాలోని తెర తీయగరాదా, తిరుపతి వెంకటరమణా! ॥నాలో॥ కేవలము ఈ తెరకాదు. మదమత్సరమనే తెర తీయగరాదా! మదముతో కూడిన మత్సరము. మానవునియందు అహంకారము, పాతవాసనలు, లౌకికమైన అభిమానము ఈవిధమైన తెరలు అనేక పొరలుగా ఉంటుంటాయి. జీవితమంతా అరలతో, పొరలతో, తెరలతో కూడినదని పాడుతుండగనే, పూజారి లేడు, మరొక వ్యక్తి లేడు, తెర తీయబడింది. ఇది త్యాగరాజు భక్తి యొక్క శక్తి యని వెంటనున్న శిష్యులు తలంచుకున్నారు.

**ప్రాణదాత**

తిరుపతి నుండి బయలుదేరారు. చిత్తూరు జిల్లా ఆనాడు అడవి. ఈనాడుకూడా అడవి ఎక్కువే. పుంగనూరు సమీపించగనే అక్కడి గొప్ప దేవాలయము, శివాలయము దర్శించాలని ఆశించాడు. ఆనాడు దొంగల భయము చాలా ఉండేది. సాయంకాలమైతే ఎవ్వరూ బయట తిరిగేవారు కాదు. ఈనాటివలె ఆనాడు  బస్సు సౌకర్యములు కాని ట్రైను సౌకర్యములుగాని ఉండేవికావు. యాత్రికులెవరో భార్య, భర్త, బిడ్డ ముగ్గురు ఆనాడే కాలినడకతో పుంగనూరు చేరేటప్పటికి చీకటిపడింది. ఏ సత్రమూ లేదు. దేవాలయము కన్నా పోదామంటే దేవాలయము తలుపులు మూసారు. ఆ దేవాలయము తలుపు దగ్గర ముగ్గురూ కూర్చున్నారు. పాపం రాత్రి చిమ్మ చీకటి కమ్ముకుంది. వర్షము ప్రారంభమైంది. భర్త లోపలికి వెళ్ళి గడియ తీసి తన భార్యాబిడ్డలను కాపాడుకొనే ఉద్దేశ్యముతో ఆ కాంపౌండు గోడ ఎక్కాడు. చీకటి కావటం వల్ల కాంపౌండు గోడ మీదనుంచి దూకాడు. కాని, ఆ స్థానములో పెద్ద బావి ఉంది. బావిలో పడ్డాడు. అతను లోపల, వీరు బయట. తల్లీబిడ్డలు బయటఅరుస్తున్నారు. భర్త లోపల ఉన్నాడు. ఈ గోల ఎవ్వరూ వినేవారు లేరు. దొంగలు వచ్చారేమోనని వారివారి తలుపులు గట్టిగా బిగించుకున్నారు ప్రజలు. చిత్తూరునుంచి రాత్రికి రాత్రే  బయలుదేరి రావాలని త్యాగరాజు ఒత్తిడి పెట్టాడు. కాని, శిష్యులందరు అడ్డుపెట్టి తెల్లవారుఝామున బయలుదేరవచ్చని ఆ రాత్రి అక్కడే నిలుపుకున్నారు. బావిలో పడిన వ్యక్తి మరణించాడు. తెల్లవారి గ్రామస్థులందరు చేరారు. ఇదంతా విచారించేటప్పటికి పరిస్థితంతా తెలిసిపోయింది. బావిలో ఉండిన వ్యక్తిని తీసారు. తల్లిని, బిడ్డను గ్రామస్థులు ఓదార్చుతూ కూర్చున్నారు. త్యాగరాజు వచ్చి చేరాడు. ఏమిటి ఈ గలాటా అని విషయాన్నంతా

తెలుసుకున్నాడు. ఆమె దగ్గరకు వెళ్లి అనేకవిధములుగా ఓదార్చాడు. బిడ్డను దగ్గరికి తీసుకున్నాడు. ఎంత ఓదార్చినప్పటికిని.......ఈ బాధను చూడలేక రాములను చింతిస్తూ తన కమండలంలో ఉన్న నీరు ఆ శవంపై చల్లాడు.' రామా! నీకు యిష్టమైతే ఈ ప్రాణాన్ని యివ్వు, లేకపోతే నా ప్రాణాన్ని తీసుకో' అన్నాడు. ఇది నా బలవంతమేమీ కాదు. నీ యిష్టమే. నా వల్ల జగమునకు కలిగేది యేమీ లేదు. నేను నీ చింతలోనే మునిగిపోయాను. ఈ ఇల్లాలు, ఈ బిడ్డా చాలా బాధపడుతున్నారు. 'పరోపకారార్థమిదం శరీరమ్'. నేను నీకర్పితమైపోయాను. ఏనాటికైనా నేను నీవాణ్ణే. నీవు నావాడివే. కాని, వీళ్ళను రక్షించు. నన్ను నీలో చేర్చుకో' అన్నాడు. కొంతసేపయ్యేటప్పటికి నిద్రించినవాడు మేల్కొన్నట్లుగా ఆ చనిపోయిన వ్యక్తి కన్నులు తెరిచాడు. కొంతసేపటిలో ఈ విషయమంతా పుంగనూరులో పాకిపోయింది. ఎవరో మహానుభావుడు వచ్చాడు. చచ్చిపోయిన వానిని బ్రతికించాడు. అని అందరూ వచ్చి అతని కాళ్లపైన పడటం, ప్రార్థించటం. ఈ గలాటా అధికమైపోయింది. ప్రతి ఒక్కరు ఇతనెవరు ఇతనెవరని ప్రశ్నించటం, కొంతమంది ఇతని తల్లిదండ్రులెక్కడున్నారు, ఇతనిదే గ్రామము, ఇతనికి సోదరులెవరైనా ఉన్నారా, మీరందరూ అతని సోదరులా అని యీరకంగా ప్రశ్నిస్తూ వచ్చారు. బ్రతికిన వ్యక్తి అతని భార్యను, బిడ్డను దగ్గర చేర్చుకున్నాడు. ద్వారం దగ్గర నిల్చుకున్నాడు. వాళ్ళందరికి జవాబు చెప్తున్నాడు.

**సీతమ్మ మాయమ్మ**

సీతమ్మ మాయమ్మ, శ్రీరాముడు మాదు తండ్రి ॥సీతమ్మ॥

వాతాత్మజ, సౌమిత్రి, వైనతేయ, రిపుమర్దన, భరతాదులు సోదరులు మాకు ఓ మనసా ॥సీతమ్మ॥

అని పాడాడు.

ఇందులో ఒక చక్కని అర్థముంటున్నాది. 'సీతమ్మ మాయమ్మ, శ్రీరాముడు మాదు తండ్రి' ఇతని తల్లి పేరు సీతమ్మయే. తండ్రి పేరు రామబ్రహ్మమే. ఇంక భవరూపకంగా చూస్తే దశరథ మహారాజు కుమారుడైన శ్రీరాముడు మా తండ్రి. అతని పత్ని సీతాదేవి నా తల్లి అని రెండింటికిని సమన్వయమైన రీతిగా పాడినాడు. లౌకిక భౌతికములందు కూడను ఆధ్యాత్మికాన్ని ప్రవేశపెట్టాడు. హనుమంతుడు, భరతుడు, శత్రుఘ్నుడు, వీరంతా నా సోదరులు. ఈవిధంగా రాముని కుటుంబాన్ని తనవారుగా చేసుకున్నాడు. ఇదే నా కుటుంబము. ఆ విశ్వకుటుంబము రామ కుటుంబము. ఇదే నా భక్తి కుటుంబము. ఇదే నా నిజమైన రామ సంబంధము.ఏనాటికిని వెంట, ఇంట, జంట, ఉండి కంటి రెప్పవలె కాపాడే దైవమే నా పెన్నిధి. నా సన్నిధి. నా సర్వస్వమని త్యాగయ్య నిరూపించాడు.

**వెడలెను కోదండపాణి**

త్యాగరాజుకు కవిత్వమే కాకుండా జ్యోతిషశాస్త్రం కూడా తెలుసు. తాను ఈ దేహముతో పది దినములు ఉండగలనని తెలుసుకున్నాడు. నన్ను స్వగ్రామం చేర్చండని ముత్తుస్వామి దీక్షితులను, శ్యామశాస్త్రిని అడిగాడు. వారు తిరువాయూరుకు పల్లకిలో తీసుకువెళ్ళారు. పరీక్షిత్ మహారాజు నేనిక నిల్చేది ఏడు దినములు మాత్రమేనని తెలుసుకొని సర్వసంగపరిత్యాగియై శుకుని వాక్యములను యేరీతిగా శ్రవణం చేశాడో ఆరీతిగా త్యాగరాజు యింకనేనుండేది పది దినములు. ఈ పది దినములు వృథాగా గడపటమెందుకని నిరంతరము రామమందిరములోనే గడిపాడు. అందరు శిష్యులను రప్పించుకున్నాడు. కమలమ్మ పాదములను పట్టి ప్రార్థించింది. 'నీ కన్నులెదురుగా నేనే పోవాలి. నీవు వెళ్ళిన తరువాత క్షణమైనా నేనుండను. సహగమనానికైనా నాకు అనుమతి యిమ్మంది'. అప్పుడు చెప్పాడు, 'తల్లి సీతమ్మ నిన్నేవిధమైన దుస్థితికి గురిచెయ్యదు. కనుక, నీవు సీతమ్మను ప్రార్థించుకోమని కోరాడు. మనసెరిగి నీ అభీష్టాన్ని నెరవేరుస్తుంది. ఆ తల్లిని ప్రార్థించుకో' అన్నాడు. భక్తుల భావము, హృదయపరిశుద్ధి ఏవిధముగా ఉంటే దానికి అనుగుణంగా ఫలితములు నెరవేరుతూ ఉంటాయి. భావమెట్లా ఉంటే మన ఫలితమట్లే ఉంటుంది. నిజముగా వీరి భావము పరిపూర్ణ ప్రేమతో, భక్తితో నిండినది. కనుక, ప్రార్థనకు తగినట్లుగా ఎనిమిదో

దినమే కమలమ్మ మరణించింది. ముత్తైదువగా మరణించాలని ఆమె ఆశ. పతి ముఖమును చూసుకుంటూ ప్రాణమును విడవాలని ఆశ. ఆమె అభీష్టాన్ని అదేరీతిగా నెరవేర్చాడు త్యాగరాజు. తన తొడపైన కమలాంబ తలను ఉంచుకున్నాడు. జీవితము అనిత్యమనే సత్యాన్ని నిరూపించాడు. ఆమెకు తులసి నీరు నోటిలో పోస్తూ యిదే రామరసమని నుతించాడు. ఆమె భర్త ముఖము చూసుకుంటూనే కన్నులు మూసింది. గ్రామస్తులంతా వచ్చి కంటి ధారలు కార్చారు. త్యాగరాజు చిరునవ్వులు చిందులుదొక్కుచు ఆనందాన్ని అనుభవించాడు. మా అభీష్టాన్ని నెరవేర్చిన రామచంద్రునికి నేను యేవిధంగా కృతజ్ఞతలు తెలపాలి? అనుకున్నది ఫలించటము మహా అదృష్టము. ఆమెకు రెండు దినములలో అంత్యక్రియలు చేశాడు. అతను కట్టు కదలలేదు. తంబుర చేత పట్టాడు. నిద్రాహారములు లేవు. ఒక్కొక్క శ్వాస రాములకే అర్పించాలి. త్యాగరాజు జీవితంలో ప్రధానంగా గుర్తించవలసినది ఆయన నిత్యజీవితము. దినానికి లక్షాయిరవైఐదువేల షడక్షరిని స్మరించేవాడు. ఈవిధంగా 26 సంవత్సరములలో 96 కోట్లు రామనామాన్ని స్మరించాడు. మిగిలిన కొద్ది కాలములోపలనే పూర్తి నూరు కోట్లు కావాలని అర్థించాడు. రాత్రింబవలు రామనామమే, రామనామమే. శరీరము శుష్కించిపోతున్నాది. రాధ కోరినట్లుగా త్యాగరాజు కూడా అంత్యమున ఒక కోరిక కోరుకున్నాడు. రామా! నేను ఇంతకాలము నిన్ను నా మానస సరోవరంలో హృదయపుష్పములో పెట్టుకొని పూజిస్తూ వచ్చాను. మానససరోవరం లోపల నా ప్రేమ జలము ఉండటం వలన నా హృదయకమలము విచ్చుతూ, వాడిపోకుండా వచ్చింది. కాని, మానస సరోవరము ఎండిపోతూ వస్తున్నాది. నా హృదయకమలము వాడిపోతూ వస్తున్నాది. ఇక్కడ నా రాముని పెట్టుకుంటే ప్రయోజనము లేదని కంటి ధారలలో పెట్టుకున్నాను. దృష్టిలోనే ఉండిన సృష్టిస్వరూపుడని నిన్ను భావించుకున్నాడను. నా కంటి ధారలు యింకిపోతున్నాయి. ఇంక నిన్ను ఎక్కడ పెట్టుకొని కాపాడుకోవాలి? నీవు కమలము వంటివాడవు. కమలమునకు జలము ఆధారము. నాలో జలము లేదు. శరీరములోనున్న నీరంతా శుష్కించి పోతున్నాది. ఇంక ఏ క్షణము లోపలనో కన్ను మూయవలసి వస్తుంది. 'నీవు నాకు కోదండపాణిగా దర్శనమిమ్మ'ని కోరాడు. రాధ కూడా మురళీధరునిగా దర్శనమిమ్మని కోరింది. రాముడు మాత్రమే కాదు లక్ష్మణుడు, సీత అందరూ దర్శనమిచ్చారు. చివర పాడినాడు,

' వెడలెను కోదండపాణి, అనుజ సౌమిత్రితో గూడి సురుచిరనవరస వాద్యములు మ్రోయగ
సురలెల్లను నుతులు చేయ వర త్యాగరాజు నుతుడు వర్ణింపను తరము కాదు ॥వెడలె॥

అన్నాడు, ప్రాణం విడిచాడు.

**సచ్చిదానందం**

తెలిసి రామచింతన చేయవే అన్నట్లుగా తాను తెలిసి ఈవిధంగా ప్రాణం వదలటమనేది ముముక్షువుల నిజమైన అర్హత. త్యాగయ్య కట్టకడపట కన్ను మూసేంతవరకు గానము చేస్తూ, భావముతో రామునిలో లీనమౌతూ వచ్చాడు. ఇంతకు ముందు అవతారములో వాల్మీకి. రామ, రామ, రామ అంటే చుట్టూ పుట్ట పెరిగిపోయింది. పుట్టలోపల రామనామమునే స్మరిస్తూ వచ్చాడు. ఏదిచేసినా, ఎక్కడికి వెళ్ళినా జాగ్రత్ స్వప్న సుషుప్తులందు రామనామము తప్ప అన్యము లేదు. భగవంతుని జీవరూపునిగా భావించినాడు. ఒక విగ్రహంగానో లేక పటముగానో భావించలేదు. సజీవమైన స్నేహితునిగా భావించుకున్నాడు. సజీవమైన దైవత్వంగా విశ్వసించాడు. సజీవమైన రూపంగా చింతిస్తూ వచ్చాడు. అదే నిజమైన భావన. అనేక పర్యాయములు స్వామికూడా చెప్తుంటారు. భగవంతుని ఒక రాయి మాదిరి, ఒక పిక్చరు మాదిరి, ఓ విగ్రహం మాదిరి భావించరాదు. విగ్రహమే భగవంతుడు అని ఆరాధించాలి. త్యాగరాజు దేనిని చూచినప్పటికి రామతత్త్వం అందులో చైతన్యరూపకంగా ప్రకటిస్తున్నదని విశ్వసించేవాడు. తనను దూషించేవారిని కూడను ప్రేమించేవాడు. ఏదోవిధంగా రాములు వారిలో చేరి వారి ద్వారా నన్ను సరియైన మార్గానికి తెప్పిస్తున్నాడని అనుకొనేవాడు. సర్వత్రా చైతన్యాన్ని భావించేవాడు. అదే చిత్. ఆ చిత్తులోనే ఉండిన స్వభావమే సత్. ఈ చిత్తు, సత్తు రెండూ చేరిన ప్రదేశమునందే ఆనందము. కనుక, ఈ సత్, చిత్, ఆనందమనేదంతా మనయొక్క పరిపూర్ణమైన జీవభావమునందే ఉంటున్నది. ఇట్టి పవిత్రమైన భావముతో త్యాగరాజు నిజముగా త్యాగములో రాజు అనే సార్థక

నామాన్ని అందుకున్నాడు.

సామూహిక ప్రార్థనలు దేశమునకు సుక్షేమమును అందిస్తాయి. 1496 సంవత్సరములో సిక్కుల గురువైన గురునానక్ సామూహిక భజనలు ప్రారంభించాడు. ఈ సామూహిక భజనలకు మొట్టమొదట పునాది వేసినవాడు గురునాననక్. ఇది క్రమక్రమేణా పెరుగుతూ వచ్చింది. తదుపరి 1649 సంవత్సరములో త్యాగరాజు రాగతాళభావములతో దానిని సమకూర్చుతూ వచ్చాడు. అప్పటినుండి భారతదేశములో సామూహిక భజనలంటూ వచ్చాయి. అందరి మనస్సులు, అందరి భావములు, అందరి రాగములు, అందరి తాళములు ఏకమైపోయి దివ్యత్వమైన అనేకత్వములోని ఏకత్వమును నిరూపించేదే భజన అని గుర్తిస్తూ వచ్చారు. సామూహిక భజనలు చాలా సారవంతమైనవి. సమర్థమైనవి. భక్తియందు భజనలకు ప్రధానమైన స్థానము నందించారు. ఈ భజనలు ప్రేమపూరితమైన భజనలు కావాలి. పల్లెలయందు మొట్టమొదట త్యాగరాజు పాటలను ప్రారంభించాడు. రండి మనమందరము కోదండరాముని భజనలు చేద్దాము. ఈ కోదండపాణి దండపాణిని దూరము చేయగలదు. దండపాణి యముడు, కోదండపాణి రాముడు. కోదండపాణి నామము దగ్గరున్నప్పుడు దండపాణి సమీపించదు. ఇలాంటి విశ్వాసముతో, యిలాంటి పరిపూర్ణమైన ప్రేమతో, దివ్యమైన భావముతో భజనలు ప్రారంబమైనాయి.

రండి పుణ్యాత్ములారా! శ్రీరాముని భజనకు రండి ధర్మాత్ములారా!
రండి మనమందరము కోదండరాముని భజనలు చేతము రండి పుణ్యాత్ములారా!
శ్రీరాముని భజనకు రండి ధర్మాత్ములారా!

(1962 సంవత్సరములో త్యాగరాజ మహోత్సవములకై బాబా తిరుపతికి వెళ్ళెను. అచ్చటనుండి వెంకటగిరికి జేరియుండినప్పుడు, శ్రీత్యాగరాజు తన భక్తురాలగు నాగరత్నమ్మకు స్వప్నమున కనబడి తన యిష్టదైవమైన రామచంద్రమూర్తియే యవతరించి యున్నందున వెంకటగిరికి పోయి భగవానుని సందర్శింపుమని సెలవిచ్చెను. అట్లే నాగరత్నమ్మ బాబాను దర్శించి యనుగ్రహింపబడెను.)

..............................................................................................................................